

నాన్న తిరిగొచ్చాడు 7
ఫాదర్స్ డే ఆనందమిచ్చాడు
విశాఖలో రోడ్డు ప్రమాదం 7
» నవదంపతులు మృతి.. వరుడు పిఠాపురం వాసి

కొండామంటే.. బంగారమాయె!

» లక్ష దాటేసిన 10 గ్రాముల బంగారం
» 24 క్యారెట్ ధర రూ.1,01,670
» 22 క్యారెట్ రూ.93,200

(రాజమహేంద్రవరం/కాకినాడ- ఆంధ్రజ్యోతి)
పసిడి ధర మిడిసిపడుతోంది. బంగారం అందని ద్రాక్షగా మారేలా ఉంది..ఎందుకంటే ఎక్కడా తగ్గుముఖం లేదు.. పెరుగుతూనే ఉంది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందని సరుకుగా మారిపోతోంది. ఇక బంగారం కొనలేం అన్నట్టు ధర పెరుగుతూ పోతోంది.తులం బంగారం లక్ష దాటేసింది. ధర రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారని వ్యాపారులు,వినియోగదారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.93,200లకు చేరింది.24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర ఏకంగా రూ.లక్ష దాటేసింది. రూ.1,01,670గా ఉంది. వెండి ధర లక్షకు పైగా ఉంది.ప్రస్తుతం కిలో వెండి రూ.1,09,400గా ఉంది. శనివారం నుంచి ఈ ధరలు కొనసాగుతున్నాయి. సోమవారం తగ్గుతుందా.. పెరుగుతుందా అనేది అంచనా వేయలేని పరిస్థితి. ఇజ్రా యిల్, ఇరాన్ యుద్ధం, రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగారం ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.ఈ నెల 26వ తేదీ తర్వాత ఆషాఢమాసం వస్తుంది. బంగారం కొనుగోళ్లు ఉంటాయి. తర్వాత శ్రావణ మాసం జోరందుకుంటుంది.కానీ పెరుగుతున్న ధరలతో తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలని పాలుపోని పరిస్థి తిలో మధ్య తరగతి సామాన్య ప్రజలు ఉన్నారు.

5 నెలలు..రూ.22 వేలు పెరుగుదల

ఇక జనవరి 1 నుంచి ఆదివారం అంటే జూన్ 15వ తేదీకి అంటే సుమారు 5 నెలల 15 రోజులకు 10 గ్రాముల బంగారం ధర రూ.22 వేలు వరకూ పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.93,200కు చేరింది.ఇదే బంగారం ధర జనవరి 1న కేవలం 71,150గా ఉంది.ఇక 24 క్యారెట్ బంగారం ధర ప్రస్తుతం రూ.1,01, 670 ఉండగా జనవరి 1న రూ.78 వేలు మాత్రమే. అంటే సుమారు 23 వేలు తేడా ఉంది. ప్రస్తు తం కేజీ వెండిధర రూ.లక్షా 9వేల 400గా ఉంది. జనవరి ఒకటన కేజీ వెండిధర రూ.88,400 మాత్రమే. జనవరి నుంచి ఇప్పటికి సుమారు రూ.21 వేలు పెరిగింది.



మార్కెట్లు..కళకళ!

తల్లికి వందనం.. జనం ఆనందం



» జనం జేబుల్లో కాసులు గలగల
» ఆదివారమైనా రద్దీగా మార్కెట్లు
» పట్టణాలకు పల్లెవాసుల క్యూ
» చిన్నారుల్లో ఆనందం
» ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి



తల్లికి వందనం డబ్బులతో జూన్ నెల టెన్షన్ నెమ్మదించడంతో కుటుంబమంతా ఆనందంగా కనిపిస్తున్నారు. దీనికి నగరాల్లోని ప్రధాన మా ర్కెట్లే నిదర్శనంగా చెప్పవచ్చు. రాజమ హేంద్రవరంలో పెద్ద బజారుకు వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తల్లికి వందనం సమయానికి అందడంతో తన ఇద్దరు మనవళ్లతో బజారుకు వచ్చానని సెయింట్ ఆన్స్‌లో చదువుతున్న విద్యార్థుల బామ్మ చెప్పారు. సీఎం చంద్రబాబు తన పిల్లలకు ఇచ్చిన డబ్బులతో వాళ్లకే సైకిల్ కొనడానికి వచ్చానని కొంతమూరుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ ఆనందంగా చెప్పారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు సమయానికి పడడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆనందంగా ఖర్చు చేస్తున్నారు..దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో ఆదివారం పెద్ద ఎత్తున రద్దీ కొనసాగింది.

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
మార్కెట్లు కళకళలాడాయి.. ఎటు చూసినా షాపులు జనంతో నిండిపోయాయి.. ఆదివారమైనా ఎక్కడా ఖాళీ లేదు.. పిల్లాపాపలతో పట్టణాలకు చేరుకుని చాలా మంది షాపింగ్ చేసే పనిలో పడ్డారు. సోమవారం నుంచి విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు షాపింగ్ చేసే పనిలో పడ్డారు. ఎక్కువగా బట్టల షాపులు, షూమార్ట్‌లు, బ్యాగ్‌ల దుకాణాలు, పుస్తకాల షాపులు కిటకిటలాడాయి. మరో వైపు ఫర్నిచర్ షాపులదీ అదే పరిస్థితి. ప్రతి ఆదివారం వాణిజ్యనగరం రాజమహేంద్రవరంలో ఈ షాపులు మూసివేసే ఉంటాయి. ఈ ఆదివారం ప్రత్యేకంగా తెరుచుకున్నాయి.

వ్యాపారుల ఆనందం..

'చాలా నెలల నుంచీ పెద్దగా బేరాలు లేవు. ఇవాళే కాస్త కుదుట పడుతున్నాం' అని ఓ వ్యాపారి అన్నాడంటే మార్కెట్లలో కళను అర్థం చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో చూస్తే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ప్రధానంగా మార్కెట్లు ఉంటాయి. కొద్ది నెలలుగా ఈ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. ఈ ఆదివారం మాత్రం ఈ మార్కెట్లు రద్దీగా కనిపించాయి. ఎక్కువగా స్కూల్‌కి సంబంధించిన అవసరాల దుకణాల వద్ద జాతర మాదిరిగా జనం హడావుడి ఉంది. దీంతో వ్యాపారులు కూడా కాస్త హుషారుగా అమ్మకాలు సాగించారు. ఆదివారం కావడంలో పెద్ద షోరూమ్‌లకు మూత వేస్తారు. గతంలో మంగళవారం సెలవుగా ఉండేది. ఆదివారం ఉద్యోగులకు, పాఠశాలలకు సెలవు కావడంతో ఆ రోజున బేరం ఎక్కువగా ఉంటుందని మంగళవారం సెలవు పుచ్చుకోవడం ఉండేది. అయితే కొన్నాళ్లుగా ఆదివారం మూసేస్తున్నారు. అయితే సండే సామాన్యుడి మార్కెట్ల దెబ్బకు బేరాలు ఉండడం లేదనే ఇబ్బందితో కూడా పెద్ద షాపులు కట్టేస్తున్నారు. అక్కడక్కడా తెరిచి ఉన్న షోరూంలలో జనం టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాల వంటి ఉపకరణాలు, వంట గది సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. డి.మార్ట్, రిలయన్స్ మోర్, విశాల్ తదితర షాపింగ్ మాల్స్ జనంతో రద్దీగా కనిపించాయి. ఉదయంనుంచి రద్దీ కొనసాగింది. ఈ ఆదివారం వ్యాపారం డబుల్ జరిగిందనేది ఒక మేనేజర్ వాదన. చిన్నచిన్న అప్పులను తీర్చుకోవడానికి తల్లికి వంద నం సహకరించిందని పలువురు వెల్లడించారు.

కుదుటపడిన బడ్జెట్..

ఏడాదిలో జూన్ నెల వచ్చిందంటే కుటుంబ బడ్జెట్‌కి దడ పట్టుకుం టుంది. ఒక్కో విద్యార్థికి ఎలా లేద న్నా రూ.10వేల వరకూ ఖర్చు తప్పదు.చంద్రన్న పుణ్యమా అని ఆ డబ్బులకు వెతుకులాడుకునే పరిస్థితి తప్పింది. జూన్‌లో స్కూల్ ఖర్చులతో మెయింటెనెన్స్ డబుల్ అవుతుంది.ఓ వైపు ఫీజులు కట్టుకొని మరో వైపు బ్యాగులు,షూలు, పుస్తకాలకు వెచ్చించాలి. ఎంతో కొంతలో కొత్త బట్టలు.. ఇతర ఖర్చులు మామూలే.దీంతో ఈ నెల వచ్చే సరికి సామాన్యుల బుర్ర అప్పు లోళ్ల చుట్టూ తిరుగుతుంది. ఎంతో కొంత చేబదులు పుచ్చుకుంటేనే గానీ ఖర్చులు గట్టెక్కని పరిస్థితి. తీరా స్కూలు అవసరాలు తీరాయని సేద తీరడానికి ఉండదు. నెలంతా ఇల్లు గడవాలి కదా!..అయితే ప్రభుత్వం దయ చూపడంతో పేద లు, మధ్య తరగతి జీవితాలకు ఈ నెలలో రుణం పుచ్చుకునే అవసరత తప్పింది. సీఎం చంద్రబా బు తన హామీని నిలబెట్టుకుంటూ తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుండడంతో హుషారుగా బజారుకు వెళ్లి ఉత్సా హంగా అన్నీ కొనేసి పిల్లల ఆనందంలో తమ సంతోషాన్ని చూసుకుంటున్నారు. ఖాతాల్లో డబ్బులు గలగల లాడడంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.

విద్యార్థులు ఎంతమందంటే..

జిల్లాలో మొత్తం 1876 పాఠశాలలున్నాయి. వాటిలో 20 ఎయిడెడ్, 1260 ప్రభుత్వ, 596 ప్రైవేటు పాఠశాలలున్నాయి. మొత్తం 2,89,779 మంది విద్యార్థులకుగాను ఎయిడెడ్ పాఠశాలల్లో 3295మంది, ప్రభుత్వపాఠశాలల్లో 1,21,513మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,64,971 మంది చదువుతున్నారు. జిల్లాలో మొత్తం 2,28,781 మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హత సాధించారు. వీరికి రూ.13వేల చొప్పున జమవుతున్నాయి. 1,49,403మంది తల్లుల ఖాతాల్లో ఈ నగదు పడుతోంది. ఇప్పటికే చాలామందికి పడింది.





ఇక తవ్వేయ్!

» రేపోమాపో మైనింగ్ పాలసీ
» ఏడాదిగా కొత్త లీజుల్లేవ్
» కుంటుపడిన మైనింగ్
» గత వైసీపీలో పూర్తిగా ధ్వంసం
» మార్పులతో ప్రభుత్వం శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలు కాబోతుంది. రేపో మాపో మైనింగ్ పాలసీ మీద జీవో రాబోతుంది. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పెద్దలే నేరుగా రంగంలోకి దిగి.. లీజుదార్లను తరిమి కొట్టేసి మైనింగ్ చేయించిన సంఘటనలు ఉన్నాయి.గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలో వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పాలసీ తెచ్చింది.కానీ ఏడాదిగా మైనింగ్ లీజులు లేవు.ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. దానిని జీవో రూపంలో ఒకటి రెండు రోజుల్లో జారీ చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్ మెటల్, రోడ్ మెటల్, గ్రానైట్, గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో ఇప్పటి వరకూ స్వంత స్థలాలు లీజుకు తీసుకున్నవారు తప్ప.. ప్రభుత్వ స్థలాలు లీజుకు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో 250 దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 250 లీజు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.ఒకట్రెండు రోజుల్లో రాబోతున్న కొత్త మైనింగ్ పాలసీ వల్ల మళ్లీ లీజులు మొదలు కానున్నాయి.ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13వ తేదీ నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కారానికి ఒక విధానం రూపొందించారు.సింగిల్ డెస్క్ పోర్టల్, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు గుర్తించి జిల్లా మైనింగ్ అధికారి లాగిన్‌లో ఉంచుతున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలిపి అర్హత లేనివాటిని తొలగిస్తారు. అర్హత ఉన్న దరఖాస్తుదారుల నుంచి భద్రత డిపాజిట్ కట్టించుకుంటారు. మూడు నెలల్లోపు ఈ చెల్లింపులు చేయాలి. తర్వాత ఎన్‌వోసీ, డీజీపీఎస్ సర్వేలు చేస్తారు. భద్రత డిపాజిట్ చెల్లించకపోతే అర్హత కోల్పోతారు. గ్రానైట్ల మార్బుల్,బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేయాలి. ఇండస్ట్రియల్ మినరల్‌కు వేలం పద్ధతి ఉంటుంది.ఇవన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ

గత ప్రభుత్వంలో మైనింగ్ అంతా ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ పెద్దల చేతుల్లోకి పోయింది. అంతకుముందు ఎవరైనా వ్యక్తికి సొంత కొండ ఉంటే దానిని పంట సాగుకు సరిచేసుకోవడానికి తహశీల్దార్, ఇతర అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోయేది. ప్రస్తుతం సొంత భూమిలో మినరల్ ఉన్నా, కొండలు ఉన్నా, ఆయా ఎమ్మెల్యేల అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. ఇటీవల అక్కడక్కడా తవ్వుతున్న గ్రావెల్, మట్టి వంటి వాటిలో కూడా లారీకి రూ.3 వేల వరకూ ఆయా ప్రాంత ప్రతినిధులు లాగేస్తుండడం గమనార్హం. గత ప్రభుత్వం సీనరేజి ప్రైవేట్ పరం చేసి కూడా బాగా దోచుకుంది. రేపో మాపో ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న కొత్త మైనింగ్ పాలసీలో ఏ మినరల్‌ను ఏ విభాగంలో పెడతారో, ఏ ధరలు నిర్ణయిస్తారో, సీనరేజి పరిస్థితి ఏంటో అనే చర్చ ఆయా వర్గాల్లో మొదలైంది.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు

గ్రీన్‌సిగ్నల్



» 30 లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు
» ఉద్యోగి స్వగ్రామ, మండలంలో పోస్టింగ్ ఇవ్వొద్దు
» ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సామర్లకోట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాటమనేని భాస్కర్ జీవోఎంఎస్ నెంబరు-5 పేరిట ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ సచివాలయాలను జనాభా ఆధారంగా రేషనలైజేషన్ చేయగా తగిన విధంగా ఉద్యోగులను నియమించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కేటగిరి-ఏ లో కనీసం ఆరుగురు ఉద్యోగులు, కేటగిరి-బీ లో ఏడుగురు ఉద్యోగులు, కేటగిరి-సీ లో కనీసం 8మంది ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 2025, మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులందరినీ బదిలీ చేయాలి. సచివాలయ ఉద్యోగి స్వగ్రామ, మండలంలో కాకుండా ఇతర మండలాల్లో నియమించాలి. సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు, నియామక అధికారాలను జిల్లా కలెక్టర్లకు కల్పించారు. ఈనెల 30లోగా బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలి. కంటిచూపులేని ఉద్యోగులు, మానసిక వైకల్యంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న ఉద్యోగులు, భర్తలేని మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలి. దంపతులిద్దరూ ఉద్యోగులైతే సమీప ప్రాంతాల్లోనే నియమించాలి. ఈ బదిలీలు స్వచ్ఛంద బదిలీలుగా పరిగణించి ప్రయాణభత్యం, ఇతర ప్రయోజనాలు కల్పించాలి. ముందుగా ఐటీడీఏ ప్రాంతాల్లో ఖాళీలను పూర్తిచేసిన తర్వాతనే మిగిలిన ప్రాంతాల్లో సచివాలయాల్లో భర్తీ చేయాలి. సచివాల యాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్త యిన తర్వాత సచివాలయాల రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన ఉద్యోగుల వివరాలను హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో జూలై 10లోపు నమోదులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

కాకినాడలో సచివాలయ ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ 7
ఉప్పాడలో ఎగసిపడుతున్న అలలు 7
ముగిసిన విరామం.. వేటకు పయనం.. 7

ఆహా ఆలివ్!



హోప్ ఐలాండ్ తీరంలో గుడ్లు పెట్టిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఆలివ్ రిడ్లే.. చేస్తోంది మేలు..

కొన్ని జీవులు చాలా తెలివిగా ఉంటాయి.. వాటి తెలివితేటలు అంచనా వేయడం అంత సులభం కాదు.. అటువంటి జీవుల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు గురించి చెప్పకుండా ఉండలేం.. అవి దేశవిదేశాలు తిరిగి మళ్లీ అవి ఎక్కడైతే పుడతాయో అక్కడే పిల్లలను పొదుగుతాయంటే నమ్ముతారా.. నమ్మక తప్పదు మరి.. ఎందుకంటే ఇది నిజం.. ఆ కథేమిటో తెలియాలంటే ఈ కథనం చదివేయాల్సిందే మరి.. నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

● 2023-24లో హోప్ ఐలాండ్‌లో 262 తాబేళ్లు 23,202 గుడ్లు పెట్టాయి.
● 2024-25లో హోప్ఐలాండ్‌లో 283 తాబేళ్లు 20,623 గుడ్లు పెట్టాయి.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ చర్యలు

» సముద్రజలాల సంరక్షణ
» మత్స్యసంపద అభివృద్ధి
» డిసెంబర్ - మే మధ్య సంచారం
» గుడ్లు పెట్టి సంతానోత్పత్తి
» కాకినాడ,కోనసీమలో సంరక్షణ
» నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం

కాకినాడ/ఉప్పలగుప్తం/కాట్రేనికోన, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితం కాకుండా.. మత్స్యసంపద అభివృద్ధికి సహకరించే సముద్రపు జీవుల్లో ప్రత్యేకమైనవి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. తీరానికి దూరంగా సముద్రపు లోతుల్లో జీవించే ఈ తాబేళ్లు సాగర జీవుల ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తాయి.సముద్రపు నాచు తింటూ.. జలాలను శుభ్రపరుస్తాయి. సముద్రంలో తాబేళ్ల సంఖ్య తగ్గిపోతే ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించిన ప్రభుత్వం ఏటా వీటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏడు రకాల సముద్రపు తాబేళ్లు ఉంటాయి. మన భారతదేశ సముద్ర జలాల్లో ఐదు రకాల సముద్రపు తాబేళ్లు ఉన్నాయి. వాటిలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒకటి. ఈ జాతి ఆడ, మగ తాబేళ్లు ఏటా డిసెంబర్ మాసంలో సంతానోత్పత్తికి సముద్రంలో కలుసుకుంటాయి. కొన్నిరోజులపాటు తీర ప్రాంతంలో సంచరిస్తాయి. జనవరి మొదటివారం నుంచి ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు సిద్ధమవుతాయి. ఫిబ్రవరి నెలలో భారీగా గుడ్లు పెట్టి.. ఏప్రిల్ నాటికి పూర్తిగా ఆపేస్తాయి. ఇవి పెట్టిన గుడ్లు పొదిగి పిల్లలుగా మారేందుకు సుమారు 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ డిసెంబర్ నుంచి మే వరకు జరుగుతుంది.ఈ ఆరు నెలల్లో ఆలివ్ రిడ్లే సంతానోత్పత్తి జరుగుతుంది.కోనసీమ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల హేచరీలున్నాయి.

కాకినాడ, కోనసీమ తీరాలకు..

సంతానోత్పత్తి సమయంలో ఈ ఆలివ్ రిడ్లే తాబేళ్లు కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం, వాసాలతిప్ప, జీకే పోర, సాక్రిమెంట్ ఆయిల్ పలు తీరప్రాంతాలకు పెద్ద ఎత్తున వస్తుంటాయి.ప్రధానంగా డిసెంబర్ నెలలో 15-20 రోజులపాటు తీర ప్రాంతాల్లో ఇవి ఉంటాయి. మగ తాబేలు సముద్రంలోకి వెళితే.. కేవలం ఆడ తాబేళ్లు మాత్రమే తీరంలో ఉంటూ గుడ్లను పెట్టి తిరిగి వెళ్లిపోతాయి. అడుగు నుంచి అడుగున్నర లోతు గొయ్యిని తవ్వుకుని..వాటిలో 60 నుంచి 160 వరకు గుడ్లు పెడతాయి.ఈ సమయంలో గుడ్లు రూపాంతరం చెందుతాయి. 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కన్నా తక్కువుంటే ఆ సమయంలో పెట్టిన గుడ్లన్నీ మేల్ జాతికి చెందినవిగా, 30 డిగ్రీల ఉష్ణోగ్రతపైబడి ఉన్న సమయంలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగా మారతాయి. 28-30 డిగ్రీ మధ్య ఉష్ణోగ్రతలో జన్మించిన తాబేళ్లు అటు మేల్ అయినా కావొచ్చు. ఇటు ఫీమేల్ అయినా కావొచ్చని శాస్త్రవేత డి.మహేష్‌బాబు తెలిపారు.

ఒడిశా టు కాకినాడ..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవన విధానం, పునరుత్పత్తి గురించి పరిశోధనలు జరుగుతున్నాయి.అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రం నుంచి ఇవి వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటాయి. ఒక తాబేలు ఒడిశాలో కేంద్రపడ జిల్లా గహీర్‌మఠ్ వద్ద సముద్రంలో ప్రయాణం ప్రారంభించి 51 రోజుల తర్వాత శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరిల మీదుగా ఇది ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకుంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాగ్ దీనికి అమర్చి పరిశీలించగా ఈ విషయం తెలిసిందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.వాటికి అనుకూలమైన వాతావరణం ఉన్న కాకినాడ హోప్ ఐలాండ్‌తో పాటు కోనసీమలోని పలు తీర ప్రాంతాల్లో ఇవి సంతానోత్పత్తి చేపడతాయి.

ఆ రెండింటి మధ్య వ్యత్యాసాలివే..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఏ తీరానికి పడితే ఆ తీరానికి రావు. ఒకసారి ఎక్కడైతే సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టాయో.. తిరిగి అదే ప్రాంతానికి వస్తాయి. సాధారణ తాబేళ్ల కన్నా ఇవి పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఇవి 35 నుంచి 50 కిలోల బరువుతో సముద్రపు నీటిలోనే ఉంటాయి. తాబేళ్లు తీరానికి చేరుకునే సమయంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో బోట్లు తిరగకుండా, చేపల వేట నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తాబేళ్ల రాకకు ఏటా అటవీశాఖ అధికారులు బేస్ క్యాంపులు సిద్ధం చేస్తున్నారు.ఏటా తాబేళ్ల రాక సంకేతాలను గుర్తించి బీచ్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేస్తున్నారు.గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నారు.



సంరక్షణకు ప్రత్యేక చర్యలు

1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. సముద్ర తాబేళ్లను సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. హేచరీలను ఏర్పాటు చేసి వాటి సంతతిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. కాకినాడ హోప్ఐలాండ్‌లో మత్స్యకార కుటుంబాలకు వీటి సంరక్షణ బాధ్యత అప్పగించి, వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. ఆరుగురు బృందంగా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నాం,
- ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, కోరింగ వైల్డ్ లైఫ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



జల జోష్!

యువత అంటేనే జోష్. అలాంటి నదిలో స్నానాలంటే రెట్టించిన ఉత్సాహంతో ఉరకలు వేస్తుంటారు. దానికి నిదర్శనమే ఈ చిత్రాలు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్ ఘాట్‌లో యువకులు చేస్తున్న జల విన్యాసాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పాపికొండలకు 196 మంది పర్యాటకులు



పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారయాత్రకు ఆదివారం 5 బోట్లలో 196 మంది పర్యాటకులు వెళ్లారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు పర్యాటకులు దేవీపట్నం మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకుని పాపికొండలకు వెళ్లారు. ఆలయానికి రూ.20,800 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. భక్తులకు గోదావరిలో స్నానాలచరించేందుకు వెళ్లనీయకుండా పోలీసు, ఆలయ సిబ్బంది గస్తీ ఏర్పాటు చేశారు.

ముగిసిన సుదీర్ఘ విరామం

వేటకు పయనం..



కొత్తపల్లి మండలం రామన్నపాలెం ఉప్పుటేరులో లంగరు వేసిన బోట్లు



తొండంగిలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి/ తొండంగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుమారు 61 రోజుల సుదీర్ఘ విరామం అనంతరం మత్స్యకారులు శనివారం తెల్లవారు జామున సముద్రం పైకి వేటకు వెళ్లారు. బోట్లలో ఆయిల్ నింపి, తినడానికి సామాన్లతో బయలుదేరారు. కాకినాడ జిల్లా కొత్తపల్లిలో, తొండంగి తీరంలో ఆదివారం పూర్తిస్థాయిలో వేటకు బయలుదేరి వెళ్లారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేటపై నిషేధం ఉండడం వల్ల వేట సాగలేదు. ప్రభుత్వం ఈ ఏడాది వేట విరామ పరిహారంగా రూ.20వేలు అందించడంతో మత్స్యకారులు ఊరట చెందారు. వేటే ప్రధాన జీవనాధారంగా గల మత్స్యకారులు నిషేధ సమయం ముగియడంతో గంగమ్మకు పూజలు చేసి వేట ప్రారంభించారు. తొండంగి మండలంలో అద్దరిపేట నుంచి చోడిపల్లి పేట వరకూ ఉన్న 2763 మంది బోట్ల ద్వారా వేట సాగించే మత్స్యకారులు పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం కొంత మేరకు అనుకూలంగా లేకున్నా సెంటిమెంట్ ప్రకారం వేట సాగించే పనికి శ్రీకారం చుట్టారు. అయితే ఆశించినంతగా మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో నిరాశగా ఒడ్డుకు చేరారు.

ఉప్పాడలో ఎగసిపడుతున్న అలలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రోడ్డుపైకి ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడనంతో సంబంధం లేకుండా కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం సమీపంలో సముద్రం లోపలి నుంచి కెరటాలు విరుచుకుపడి గట్టును దాటి బీచ్ రోడ్డును తాకడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాన్న తిరిగొచ్చాడు

ఫాదర్స్ డే ఆనందమిచ్చాడు

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినా పిల్లలపై బెంగ, మమకారం పోలీసుల చొరవ ఆ వ్యక్తిని తిరిగి రప్పించాయి. ఫాదర్స్ డే రోజున తండ్రిని తిరిగి కలుసుకున్న ఆ పిల్లల్లో ఆనందం వ్యక్తమైంది. కాకినాడ జిల్లా పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన గీసాల శ్రీనివాస్ (39) మే 29న తన స్నేహితుడైన కాకి రమణ మోటారుసైకిలు తీసుకుని ధవళేశ్వరంలో ఒక వ్యక్తి డబ్బులు ఇవ్వాలని చెప్పి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల వరకు భార్యతో ఫోనులో మాట్లాడి తర్వాత స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన భార్య లక్ష్మి బంధువుల సహాయంతో వెదకగా తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద శ్రీనివాస్ తీసుకువెళ్లిన బైక్, దుస్తుల బ్యాగు, చెప్పులు కనిపించాయి. దీనిపై మే 31న లక్ష్మి భర్త అదృశ్యంపై ఫిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 3 బృందాలను ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బైక్, దుస్తులు, ఇతర వస్తువులు వదిలిన అనంతరం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వరకు వెళ్లినట్టు గుర్తించారు. అప్పుల బాధ నుంచి విముక్తి పొందాలనే ఉద్దేశ్యంతో అక్కడి నుంచి కాశీ వెళ్లినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడిని కాంటాక్ట్ చేసే రప్పించేందుకు పోలీసులు ప్రయత్నించారు. అదే సమయంలో భార్య, పిల్లలపై బెంగతో శ్రీనివాస్ ఆదివారం పిఠాపురం తిరిగివచ్చాడు. ఫాదర్స్ డే రోజున శ్రీనివాస్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ తండ్రి తిరిగి రావడంతో ఆ పిల్లలు ఎంతో సంబరపడ్డారు. తండ్రిని తమ చెంతకు చేర్చిన సీఐ శ్రీనివాస్‌కు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాస్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

తల్లికి వందనంతో వెల్లివిరిసిన ఆనందం

● ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ● మంత్రి సుభాష్



సమావేశంతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుతో తల్లుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుందని, ప్రభుత్వానికి తల్లులు వందనం చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం బులుసు కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చదువుకు మించి ఆయుధం లేదని, చదువుతో ప్రపంచాన్ని మార్చవచ్చన్నారు. పాఠశాలలు తెరచిన నాటికి సకాలంలో ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడిందన్నారు. వైసీపీ పాలకులు రాష్ట్రంలో 67.27 లక్షల మందికి అమ్మఒడి ఇచ్చామని చెప్పి కేవలం 42 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని మంత్రి ఆరోపించారు. ఫీజు రీఎంబర్స్ మెంటు పథకం బకాయిలు పెట్టడంతో కూటమి ప్రభుత్వంపై భారం పడిందన్నారు. తల్లులు లేనివారికి తండ్రి లేదా సంరక్షకుని ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమచేశామన్నారు. పాఠశాలలు తెరచిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు అందచేశామన్నారు. రాష్ట్రంలో 9600 ఆదర్శ పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడిని నియమించి విద్యా ప్రమాణాలు మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి హాస్టళ్లకు సన్నబియ్యం ఇప్పటికే సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వం నాడు- నేడు పథకంతో నిధులు కాజేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకొచ్చి గాడిలో పెట్టామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుచేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సందడి మరువకముందే

ప్రాణాలు కోల్పోయిన నవ దంపతులు



సాయి,శాలిని ఫైల్‌ఫొటో

వరుడు పిఠాపురం వాసి

విశాఖలో రోడ్డు ప్రమాదం





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయి,శాలిని

మల్కాపురం (విశాఖపట్నం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే.. మామిడి తోరణాలు వాడకముందే.. పెళ్లి నాటి సందడిని మరువకముందే ఆ నవ దంపతులు కానరాని లోకాలకు తరలి'పోయారు'. ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న నెల రోజులకే వారిద్దరూ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విశాఖలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి మారుతి జంక్షన్ వద్ద జరిగిన ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన జొన్నాడ సాయి (27), విశాఖలోని గంగవరం ప్రాంతానికి చెందిన ఎరిపిల్లి శాలిని (25) గాజువాకలోని బెస్ట్ విజన్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గతనెల 9న వివాహం చేసుకున్నారు. అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ రామారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘ నేతలతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మెజారిటీ సంఘీయుల ఆమోదంతో తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానన్నారు. అప్పట్లో ఎన్నికలు పెట్టి సంఘీయుల మధ్య చీలిక తేవాలని భంగపడ్డ కొందరు తిరిగి ఇప్పుడు పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి విధానాలు మానుకుని సంఘీయుల కోసం పాడుపడాలన్నారు. ఆలిండియా పద్మశాలి పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, పద్మశాలి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు ఆమంచి అంజనేయస్వామి మాట్లాడుతూ పద్మశాలిల సంక్షేమం కోసం రామకృష్ణ ఎంతో కృషి చేశారన్నారు. సమావేశంలో డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పేరిశెట్టి లారయ్య, మేరెడి భాస్కరరావు, నేమాని ఆదివిష్ణు, పొన్నగంటి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పిఠాపురం బాక్సర్



ఐశ్వర్య సూర్య దీపిక

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన జె.ఐశ్వర్య సూర్య దీపిక ఎంపికైంది. విశాఖపట్టణంలో మే 30, 31 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ బాలికల పోటీల్లో సూర్యదీపిక 80 కిలోల ప్లస్ విభాగంలో రజత పతకం సాధించింది. స్వర్ణ పతకం సాధించిన విజయనగరానికి చెందిన బాక్సర్ జాతీయ పోటీల నుంచి తప్పుకోవడంతో సూర్యదీపికకు ఆ అవకాశం లభించింది. ఈమె ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో జరిగే 6వ జాతీయ స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుంది. సూర్యదీపిక, ఆమె కోచ్ లక్ష్మణరావులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, కె.పద్మనాభం, కూటమి నాయకులు అభినందించారు.

'అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి

ఉన్నతాధికారులతో కమిటీ నియమించాలి'



అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో అగ్రిగోల్డ్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులతో కమిటీలను నియమించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి తగిన నిధులు కేటాయించాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం అశోక్‌నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఫులపర్తి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే అగ్రిఆస్తులు కబ్జాలకు గురయ్యాయన్నారు. పదేళ్ల పోరాట ఫలితంగా రూ.906కోట్లు డిపాజిట్లు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన రూ.3400కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇచ్చిన హామీ మేరకు న్యాయం జరగకపోతే ఉద్యమబాట పడతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లంకేష్, కోశాధికారి శ్రీరామమూర్తి, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాములేరు వాగులో గల్లంతైన

యువకుల మృతదేహాలు లభ్యం



సాదిష్, రవితేజ మృతదేహాలు

మారేడుమిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం పాములేరు వాగులో శనివారం గల్లంతైన డి.సాదిష్(23), కటకం రవితేజ(30) మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువకులు శనివారం మారేడుమిల్లి ప్రాంతానికి పర్యాటకానికి విచ్చేశారు. వీరిలో సాదిష్, రవితేజ పాములేరు వాగులో స్నానానికి దిగి గల్లంతయ్యారు. శనివారం మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఉదయం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చేయగా వాగులో ప్రమాదకరమైన స్థలం వద్ద వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సాదిష్ ఫొటోగ్రాఫర్ కాగా రవితేజ కారు ట్రావెల్స్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

భక్తులతో కిటకిటలాడిన 'లోవ'

రూ.7.17 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణానికి చేరుకుని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. మొక్కులు తీర్చుకుని అనంతరం వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి ఆదివారం ఒక్క రోజే రూ.7.17 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో, ఉప కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి



ముత్యాలమ్మ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. తుని మండలం తాళ్ళూరు గ్రామానికి చెందిన గండి ముత్యాలమ్మ (53) తన మనవడు గౌతమ్ చరణ్‌ను వెంటపెట్టుకుని కాకినాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరింది. తునిస్టేషన్ దాటిన తరువాత ఆమెకు వాంతులు అవ్వడంతో డోర్ వద్దకు చేరుకుంది. స్పృహ తప్పి డోర్ నుంచి జారి పడడంతో పాయకరావుపేట మండలం సీతారామపురం సమీపంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సచివాలయ ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలకు ప్రమోషన్స్ కం ట్రాన్స్‌ఫర్స్ కోసం ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో 8 మంది వైద్యాధికారుల బృందం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కౌన్సెలింగ్ జరిపింది. 400 మందికి 390 మంది హాజరయ్యారు. ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఏ(ఎఫ్)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురికి ఆరోగ్య అవసరాల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.15.70 లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ, కుమ్మర వీధి, మండలంలోని మాధవపురం, రాపర్తి, రాయవరం గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. నాయకులు చెల్లుబోయిన సతీష్, దానం లాజర్‌బాబు, బాలిపల్లి రాంబాబు, బొజ్జా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పిఠాపురం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ శివారు వాటర్ వర్క్స్ సమీపంలో పేకాడుతున్న వారిపై ఎస్ఐ మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. 13 మందిని అరెస్టు చేసి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు.

పిఠాపురం ఏపీపీ బదిలీ

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ ఆకుల లీలా నాగరోజా పెద్దాపురం కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ముమ్మిడివరం ఏపీపీ సీహెచ్ జగదీష్ రానున్నారు.

దశ తిరిగింది

పిఠాపురం బైపాస్ రోడ్డులో పాదగయ క్షేత్రం చెంతనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల దశ తిరుగుతోంది. నూతన భవనాల్లోకి వచ్చిన తర్వాత పలు సౌకర్యాలు సమకూరుతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.1.75కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించారు. వీటితో ఇప్పటికే పలు వసతులను సమకూర్చగా మిగిలిన పనులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



కంప్యూటర్ ల్యాబ్



ఆర్వో ప్లాంటు సమకూర్చిన దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు
సమకూరిన ఆర్వో ప్లాంటు, ఫర్నిచర్
డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో రూ.1.75కోట్ల సీఎస్ఆర్ నిధులు
మిగిలిన నిధులతో కాంపౌండ్‌వాల్, అదనపు భవనాల నిర్మాణం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పిఠాపురం పట్టణానికి 2008లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. అప్పటి నుంచీ ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల్లోనే అరకొర వసతులతో కొనసాగింది. సరైన ల్యాబ్, ఇతర సౌకర్యాలు లేక, మధ్యాహ్నం తరగతులతో విద్యార్థులు ఇబ్బందులుపడుతూ ఉండేవారు. 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు పాదగయ క్షేత్రం చెంతన రెండు ఎకరాలు కేటాయించి, భవనాల నిర్మాణం నిమిత్తం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. పనులు నత్తనడకన సాగాయి. అసంపూర్తిగానే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణాలు పూర్తి చేయించి నవంబరు నెలలో ప్రారంభించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ,



జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ సైన్స్, బీఏ కోర్సులు వున్నాయి. ప్రస్తుతం 340 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏ వసతులు అవసరమో గుర్తించి వాటిని సమకూర్చాలని, అదనపు భవనాలు నిర్మించాలని పవన్ సూచించారు. దీంతో కలెక్టర్ షాన్ మోహన్ చొరవ తీసుకుని దివీస్ లేబొరేటరీస్, ఓఎన్జీసీ ప్రతినిధులతో చర్చించగా వారు సీఎస్ఆర్ కింద రూ.1.75 కోట్లు నిధులు మంజూరు చేశారు.

దివీస్ ల్యాబ్స్ మంజూరు చేసిన రూ.75లక్షల్లో రూ.20లక్షలతో చేసి 20 కంప్యూటర్లతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ఆర్వో ప్లాంటు, డ్యూయల్ డెస్క్‌లు, ఆఫీసు టేబుళ్లు, చైర్లు, ఇతర ఫర్నిచర్ సమకూర్చారు. అన్ని వసతులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో రక్షిత తాగునీరు అందుతోంది. మిగిలిన రూ.55లక్షలతో కాంపౌండ్‌వాల్ నిర్మించనున్నారు.

ఓఎన్జీసీ సీఎస్ఆర్ కింద రూ.కోటి మంజూరు చేసింది. ఈ నిధులతో కళాశాలకు అవసరమైన అదనపు భవనాలు నిర్మించనున్నారు. కెమిస్ట్రీ, జువాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. వేసవి సెలవుల అనంతరం డిగ్రీ తరగతులు ప్రారంభమయ్యే నాటికి ఈ పనులన్నీ పూర్తయ్యేలా చూడాలని డిప్యూటీ సీఎం పేషీ నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. పవన్‌కల్యాణ్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

26 నుంచి వారాహి నవరాత్రులు

కాకినాడ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం సెంటర్లోని హ్రీం పీఠంలో ఈ నెల 26 నుంచి జులై 4వ తేదీ వరకు వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు ఈశ్వర్ తెలిపారు. నవరాత్రుల విజయవంతం కోసం ఆదివారం హీలియంపేటలో లక్ష్మీగణపతి హోమం, వారాహి, లలిత, రాజశ్యామల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఇంజనీరింగ్ వర్కర్లకు సంఘీభావం

పెద్దాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లకు కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు తోట కరుణాకర్ (సోనీ) ఆదివారం సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను తక్షణం తీర్చాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

యోగాంధ్ర సన్నాహక సమావేశం

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈ నెల 21న జరగబోయే యోగాంధ్ర సన్నాహక సమావేశాన్ని విజయనగరం రాజావారి కోటలో ఆదివారం నిర్వహించారు. పరిశీలకుడిగా హాజరైన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ యోగాంధ్రకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా క్రీడా ప్రాంగణం నుంచి బస్సులో విజయవాడ బయల్దేరుతున్న క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పయనం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా నిర్వహించిన పోటీల్లో మండల స్థాయి విజేతలుగా నిలిచిన వారికి ఈ నెల 9 నుంచి 13 వరకు 12 విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో మూడు కేటగిరీల్లో 11 విభాగాల్లో 45 మంది క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వీరంతా ఈ నెల 16, 17 తేదీల్లో విజయవాడలోని గుంటపల్లి డాన్‌బాస్కో స్కూల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదివారం కలెక్టర్ షాన్ మోహన్ ఏర్పాటుచేసిన బస్సులో ఇన్‌చార్జి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం బయల్దేరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ షహజాద్ ఆలీ, ఆయుష్ జిల్లా అధికారి శ్రీనివాస్, ఆయుష్ ఉద్యోగి జీఎస్ఎస్‌వీపీ సత్యనారాయణ, యోగా కోచ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గరగ నృత్య వాయిద్య కళాకారుల సంఘం రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనారాయణపురం వడ్డీల రామాలయం వద్ద ఆదివారం శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర గరగ నృత్య వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘ సమావేశాన్ని అధ్యక్షుడు పసుపులేటి సూరిబాబు, కార్యదర్శి గంగబాబు అధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, జిల్లా కళాకారుల సంఘం కార్యదర్శి ఉప్పుడి గోపీకృష్ణ, నాయకుల సమక్షంలో కళాకారుల సంఘం రిజిస్ట్రేషన్ పత్రాన్ని సభ్యులకు అందజేశారు. కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. నూతన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కోసం ప్రణాళిక రూపొందించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంభారపు శ్రీనివాసరావు, నాయకులు సిగటాపుల రామారావు, పొనకర్లపల్లి అప్పారావు, తరగంపూడి వాసు, కొవ్వూరు అచ్చుతశ్రీనివాసరావు, పిఠాపురం అబ్బులు, బందరు అప్పారావు, కొయ్యని ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామపురం మున్సిపల్ పాఠశాలను తెరవండి

జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సామర్లకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పరిధిలోని కోదండ రామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సోమవారం తెరిచి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని సామర్లకోట ఎంఈవో వై. శివరామకృష్ణయ్యను డీఈవో పి.రమేష్ ఆదేశించారు. ఆదివారం 'కోదండరామపురం మున్సిపల్ పాఠశాల మూసివేత' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి వాస్తవ సమాచారాన్ని ఎంఈవో శివరామకృష్ణయ్య ద్వారా సేకరించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన రోజునే ఎందుకు తెరవలేదు, రెండు రోజులు తెరవకపోయినా ఎందుకు ఆరా తీయలేదు, పనిచేయాల్సిన ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నారు, తెరవకపోవడంపై ఎందుకు నివేదికలు అందజేయలేదు. తదితర అంశాలపై మండల విద్యాశాఖాధికారులను ప్రశ్నించినట్టు సమాచారం. విద్యార్థులు లేకపోతే వార్డులో సర్వే నిర్వహించడం ద్వారా కొత్త అడ్మిషన్లు ఎందుకు నిర్వహించలేదు అని ఆరా తీసినట్టు తెలిసింది. పాఠశాలల్లో నిత్యం జరిగే కార్యక్రమాలపై సీఆర్పీలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించేందుకు పాఠశాలలకు వెళ్ళాల్సి ఉన్నప్పటికీ విధులకు డుమ్మా కొట్టినట్టు సమాచారం. సోమవారం పాఠశాల ప్రారంభించేందుకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంఈవోను విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. కాగా పాఠశాలను మూసివేయలేదని ఎంఈవో ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపినప్పటికీ మూడు రోజులు ఎందుకు తెరవలేదో చెప్పలేకపోయారు.



ఎంపీ పురందరేశ్వరిని సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ బాబు

ఎంపీ పురందేశ్వరిని కలిసిన డీసీసీబీ చైర్మన్

పెద్దాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమెను పుష్పమాల, దుశ్శాలువాతో సత్కరించారు. బీజేపీ నేత దుర్గా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఈ నెల 21న విశాఖపట్టణంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి అనకాపల్లి పార్లమెంటరీ కో-ఆర్డినేటర్‌గా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)ను నియమించారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు ఆ పార్టీ పెద్దాపురం కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

ఘనంగా గంగమ్మ తల్లి కలశ పూజా మహోత్సవం



కలశ పూజా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆకాంక్షించారు. ఏటిమొగ రోడ్డులోని మత్స్యనారాయణస్వామి, గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి కలశ పూజ, జాతర ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రత్యేక పూజలు జరిపారు. రెండో రోజు 500 మంది మహిళలు కలశాలతో ఏటిమొగ శివారు వరకు పాదయాత్రగా వెళ్లి సముద్రంలో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాటి ధర్మారావు, కోశాధికారి చింతా పేర్రాజు, ఉపాధ్యక్షులు మల్లాడి రాజు, పాలెపు ధర్మారావు, లంకే నూకరాజు, మత్స్యకార నాయకులు కర్రి నారాయణరావు, పినపోతు తాతారావు, చెక్కా లక్ష్మణరావు, వనమాడి కోయరాజు, పినపోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

భారీ వర్షం

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయం కావడంతో పాటు పలుచోట్లు డ్రైన్లు పొంగిపొర్లాయి. కొద్ది రోజులుగా ఉక్కపోత వాతావరణంతో సతమతమవుతున్న ప్రజలకు చల్లబడిన వాతావరణం ఊరటనిచ్చినా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. మధ్యాహ్నం నుంచి ఎండకాయడంతో పాటు సాయంత్రం నుంచి ఉక్కపోత ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందిపడ్డారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. చల్లదనంతో ప్రజలు సేదతీరారు. కాగా ఇంటింటికీ ఉచిత మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ఇటీవల తవ్విన రోడ్లు వర్షానికి ఎర్ర మట్టితో బురదగా మారాయి.

నేడు పీజీఆర్ఎస్

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చని చెప్పారు.



సామర్లకోట మండలం కొప్పవరంలో యోగాంధ్రలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

కొప్పవరంలో యోగాంధ్ర

సామర్లకోట/కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యోగా మాసోత్సవంలో భాగంగా ఆదివారం కొప్పవరం కూడలిలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో యోగాంధ్ర నిర్వహించారు. యోగా గురువు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్, జేఎన్టీయూకే యోగా అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధ, యోగాచారి చిట్టూరి చిట్టిబాబు, యోగా గురువు వీరబాబు సుమారు 250 మంది విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ రాజు, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని), ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్ న్యూటన్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికీ లక్ష్మణమూర్తి జ్ఞాపికలు అందజేశారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలో పట్టణంలో వేంచేసియున్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం యోగా తరగతులు నిర్వహించారు. యోగా గురువు వనం సత్యప్రియ పలువురితో యోగ సాధన చేయించారు. కాకినాడ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు వీరబాబు, కోచ్ వెంకట్, ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని దివిలిలో ఆదివారం నిర్వహించిన యోగాంధ్రలో ఆయన పాల్గొన్నారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా ఆరోగ్యకర జీవనానికి ఎంతో దోహదపడుతుందన్నారు. యోగా గురువును ఘనంగా సత్కరించారు. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, బాబ్జీరావు పాల్గొన్నారు.



పిఠాపురంలో...



పెద్దాపురంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



సామర్లకోట గూడ్స్ యార్డులో ధాన్యం బస్తాలను దిగుమతి చేస్తున్న దృశ్యం

ఛత్తీస్‌గఢ్ నుంచి ధాన్యం దిగుమతులు

రవాణా ద్వారా రైల్వే శాఖకు రూ.38 లక్షల ఆదాయం

సామర్లకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి ఆదివారం సాయంత్రం 1,800 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతు అయ్యింది. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక భారీ రైస్ మిల్లు ఈ దిగుమతులు చేసుకున్నట్టు రైల్వే గూడ్స్ యార్డు అధికారులు తెలిపారు. తద్వారా రైల్వేకు రూ.38లక్షల ఆదాయం సమకూరింది. ఎగుమతులు, దిగుమతులు రూపంలో 100 లారీలకు మరో రూ.10 లక్షల ఆదాయం, 100 మంది హమాలీలకు రూ.2 లక్షల ఉపాధి లభించింది. మరో వారంలో ఇంలో నాలుగు వేల మెట్రిక్ టన్నుల మేర ఛత్తీస్‌గడ్ ధాన్యం దిగుమతి కానుందని రైస్‌మిల్లు యాజమాన్యాల ద్వారా తెలిసింది.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రౌతులపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములగపూడి హైస్కూలు 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారకులైన గురువర్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



శ్రీశ్రీ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సాహితీ స్రవంతి అధ్యక్షుడు కృష్ణబాబు

'తెలుగు సాహిత్యాన్ని శాసించిన కవి శ్రీశ్రీ'

పెద్దాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాన్ని శాసించిన గొప్ప కవి శ్రీశ్రీ అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్లవ కవిగా, సంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, సినీ రచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతలను ఆర్జించిన గొప్ప వ్యక్తి శ్రీశ్రీ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో చల్లా విశ్వనాథం, రెంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులకు సత్కారం

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రతాప్‌నగర్‌లోని జనావళి వృద్ధాశ్రమంలో వయో వృద్ధులను శాలువాలతో సత్కరించి పండ్లు, బిస్కట్లు, పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. రాష్ట్ర వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ పర్యవేక్షకుడు రాజు, జనావళి సేవాశ్రమం వ్యవస్థాపకుడు శ్యామ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొండా నిర్మల, జిల్లా ఉపాధ్యక్షుడు వి.శివాజీగణేష్, ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ సుధాకరరావు, జనచైతన్య సంస్థ చైర్మన్ కర్రి రాజు, సీనియర్ సిటిజన్స్ సంస్థ సభ్యులు కట్టమూరి సత్యనారాయణ, గోపాలరావు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



వయో వృద్ధులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

19న తొండంగి మండల సమావేశం

తొండంగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి అందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తల్లికి వందనంతో ఆర్థిక ఆసరా


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఎటపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో నగదు తల్లుల ఖాతాల్లో జమకావడంతో ఆర్థిక ఆసరా చేకూరుతుందని నియోజక వర్గ తెలుగుయువత ఉపాధ్యక్షుడు విజ్జగిరి రవితేజ అన్నారు. ఆదివారం తల్లికి వందనం నగదు జమకావడంతో విద్యార్థులతో తల్లులతో సీఎం చంద్రబాబు చిత్రపటానికీ క్షీరాభిషేకం నిర్వహించారు. విద్యా సంవత్సర ప్రారంభ సమయంలో తల్లుల ఖాతాల్లో నగదు జమచేయడంతో హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనంతో అనేక కుటుంబాలకు ఆసరా లభించిందని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మోతుగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు కూడలివద్ద చింతూరు సీఐ తెల్లం దుర్గాప్రసాద్ ఆధ్వర్యం లో సాయుధ బలగాలు జల్లెడ పట్టాయి. మావోయిస్టులు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన నేపథ్యం లో ఆగస్టు 3వరకు సభలు దేశ వ్యాప్తంగా నిర్వహించాలని పార్టీ కేంద్రకమిటీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆదేశాలతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం మోతుగూడెం సంత కావడంతో పర్యాటక ప్రదేశంలో వచ్చి పోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించకూడదని, ఎవరైనా కొత్త వ్యక్తులు కనబడితే వెంటనే మాకు సమాచారం తెలియజేయాలని సీఐ తెలిపారు.

ఆక్రమణల తొలగింపులో జాప్యం సరికాదు

మోతుగూడెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన కట్టడాలను నోటీసులు ఇచ్చిన 15రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తహసీల్దార్ చిరంజీవి ఈనెల 3న ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా తమ కట్టడాలని దూరంగా జరుపుకొంటున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు ఇచ్చే మార్కింగ్ బట్టి జరుపుకోవచ్చని నిర్ణయించుకున్నారు.

రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలకు మారేడుమిల్లి అభ్యర్థులు

మారేడుమిల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అల్లూరిసీతారామరాజు జిల్లా స్థాయి యోగాంధ్ర పోటీలలో మారేడుమిల్లి అభ్యర్థులు సత్తాచాటారు. శుక్రవారం పాడేరులో జరిగిన జిల్లాస్థాయి యోగాంధ్రపోటీలలో పల్లాల బాలప్రసాద్‌రెడ్డి, గొర్లె జగన్నాధ రెడ్డి, కడబాల గంగాభవాని యోగాంధ్ర సోలో కేటగిరిలో జిల్లా నుంచి విజేతలుగా నిలిచారు. విజయవాడలో జూన్ 16 నుంచి 18 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో సత్తా చాటనున్నారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగాంధ్రపోటీలకు మారేడుమిల్లి మండలం నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

వైసీపీ నాయకులు మంత్రి లోకేశ్‌కి క్షమాపణ చెప్పాలి

దేవీపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో రూ.13వేలు తల్లులు ఖాతాలో వేసి రూ.2వేలు లోకేష్ జేబులోకి వెళ్లాయని వైసీపీ నాయకులు ఆరోపణ చేయడం సిగ్గుచేటని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన ఫజుల్లాబాద్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి లోకేష్ జేబులోకి రూ.2వేలు వెళ్లినట్లు నిరూపించగలరా లేనిచో లోకేష్‌కి క్షమాపణ చెప్పాలని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో తల్లికి వందనం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అందిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. కొంతమంది బ్యాంక్ ఖాతాలు యాక్టివ్‌గా లేవని అలాంటి వారు ఖాతాలు యాక్టివ్ చేసుకుంటే డబ్బులు జమవుతాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 42లక్షల మందికి ఇస్తే తమ కూటమి ప్రభుత్వం 67,27,164మందికి ఇచ్చిందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దాకరపు సత్యనారాయణ, ముచ్చు వీరవెంకటసత్యనారాయణ, రేలంగి రాంబాబు, గేదల పెదసుబ్బారావు, సూర్యారావు, దివేశ్వరరావు, శివశివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ భూములు అమ్ముతున్నా పట్టించుకోరా?

దేవీపట్నం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట 1 పంచాయతీలో ఆర్‌అండ్‌ఆర్ భూములు గిరిజనేతరులు బోర్డు పెట్టి మరీ అమ్మకాలకు స్వాగతం పలుకుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధి సహాయంతో గిరిజనేతరుడు ఇక్కడ స్థలంలో బోర్డుపెట్టి మరీ అమ్మకానికి దిగాడన్నారు. దీనిపై అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

'ఆదివాసీ జేఏసీ దీక్షలకు ఆర్థిక సహాయం అందించండి'

కూనవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతూరులోని ఐటీడీఏ ఎదురుగా ఆదివాసీ హక్కుల కోసం జరుగుతున్న ఆదివాసీ జేఏసీ దీక్షలకు ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జోగారావు అన్నారు. 32 రోజులుగా ఈ దీక్షలు కొనసాగుతున్నాయని వీటిని కొనసాగించాలంటే ఆదివాసీ సోదరులు ఆర్థిక సహాయంతో ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం ఈ దీక్షలపై ఇప్పటికే సానుకూలంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వం ముందు ఉంచిన మూడు డిమాండ్లలో ఒక డిమాండ్ నెరవేరిందన్నారు. ఈ దీక్షలో ఆదివాసీలు పాల్గొనేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి అర్జున్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తాటి రామకృష్ణ, సభ్యులు సోండె వెంకటేశ్వర్లు, కారం రత్తయ్య పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఎటపాక జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశంకోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ కేటీ ప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్ చేసుకొనుటకు తుది గడువు జూలై 29 వరకు ఉన్నట్లు చెప్పారు. ఎంపిక పరీక్ష డిసెంబరు 13 నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతంలో ఆదివారం పర్యాటకులు కేరితలు కొట్టారు. శనివారం ఆదివారం సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. చిన్నారులు జలపాతం నీటిలో తడుస్తూ ఆనందంగా గడిపారు. జలపాతం కలకల్లాడింది. బండరాళ్ళ మధ్య నుంచి జాలువారుతున్న నీటిలో తడిసి ఆనందంగా పర్యాటకులు గడిపారు.


పొల్లూరు జలపాతం వద్ద కేరింతలు కొడుతున్న దృశ్యం

టీడీపీ ఎన్నికల పరిశీలకులుగా నారాయణ స్వామి, వెంకటేశ్వరరావు



ఏలేశ్వరం/ప్రత్తిపాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల కమిటీ ఎన్నికల అబ్జర్వర్‌లుగా ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణ స్వామి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం వారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జగ్గంపేట, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభల కృషి మేరకు అబ్జర్వర్‌లుగా నియమితులైన నారాయణస్వామి, వెంకటేశ్వరరావులు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మూలగపూడి హైస్కూల్ 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రౌతులపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మూలగపూడి హైస్కూల్లో 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వారంతా కుటుంబసభ్యులతో వచ్చి సందడి చేశారు. ఆనాటి అల్లరిని గుర్తు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు.

కూడళ్లలో డేంజర్ బెల్స్



శంఖవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తిపూడి స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిస్థితి ఈ విధంగా ఉంది. మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇలాంటే పరిస్థితే ఉంది. కొన్నిచోట్ల గ్రామస్తులు, మరికొన్ని చోట్ల పశువులు విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందిన సంఘటనలు జరిగాయి. విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యమని, మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

యోగాంధ్ర సన్నాహక సమావేశం

పిఠాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 21న జరిగే యోగాంధ్ర సన్నాహక సమావేశాన్ని పిఠాపురంలో ఆదివారం నిర్వహించారు.

పాఠ్య పుస్తకాలు పక్కదారి!

లోపించిన విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ


ఏలేశ్వరం బాలికోన్నత పాఠశాలలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

ఏలేశ్వరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న పాఠ్యపుస్తకాల పంపిణీ పక్కదారి పడుతోంది. అర్హులకు అందాల్సిన పుస్తకాలు అర్హత లేనివారి చేతికి వెళ్లిపోతున్నాయి. విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పాఠ్య పుస్తకాల పంపిణీ ఏలేశ్వరం పట్టణం, రూరల్‌లో సక్రమంగా జరగడంలేదు. పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి స్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు చేర్చాలని ప్రభుత్వ నిర్ణయం. కానీ అధికారుల అనాలోచన నిర్ణయాలతో పలు పుస్తకాలు చేరాల్సిన వారికి అందడంలేదు. మండలంలోని పట్టణం, రూరల్‌లో 40 పాఠశాలలు ఉన్నాయి. వీటికి సరఫరా చేసేందుకు ప్రభుత్వం 22,965 పాఠ్యపుస్తకాలను.. 37,247 నోట్ పుస్తకాలను సమకూర్చింది కానీ ఆయా పాఠశాలలకు పుస్తకాలను చేర్చేపనులు జరుగుతున్నాయి. గత రెండేళ్లుగా కాలంగా పాఠ్య పుస్తకాల సరఫరా సక్రమంగా జరగడంలేదని విమర్శలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం సగం పూర్తయినా గానీ పిల్లలకు పుస్తకాలు అందని స్థితి గతేడాది నెలకొంది. ఈమారు ఇదే తరహాలో వ్యవహార శైలి కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పాత పుస్తకాలు కూడా నల్లబజారుకు తరలిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాలు ప్రయివేటు పాఠశాలకు తరలి వెళ్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

తల్లికి వందనం విజయవంతం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


ఎమ్మెల్యే సత్యప్రభను కలిసి ధన్యవాదాలు చెబుతున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకం ఎంతో విజయవంతమైందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున తల్లికి వందనం లబ్ధిదారులు, పిల్లలు తరలివచ్చి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ఇళ్లల్లో ఎందరు చదువుతున్నా వారందరికీ అమలు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఎక్కడికివెళ్లినా ఆ పథకం విజయవంతంపై మాట్లాడుకుంటున్నారని తెలిపారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్న కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్.పైడిపాలలో సంబరాలు

రౌతులపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో భాగంగా ఒకే కుటుంబంలో నలుగురు, ఐదుగురు పిల్లలకు డబ్బులు రావడంపై ఎస్.పైడిపాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈగల సత్తిబాబు, గొల్లు పెద్దదివాణం, గండేపల్లి శివ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి ఊరేగించారు. రౌతులపూడిలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, యువ నాయకుడు ఇటంశెట్టి అశోక్ అధ్వర్యంలో పాలాభిషేకాలు నిర్వహించారు.


ఎస్.పైడిపాలలో పాలాభిషేకం చేస్తున్న ప్రజలు

విద్యార్థినికి ఎమ్మెల్యే సత్యప్రభ సత్కారం


పెద్దనాపల్లిలో వైష్ణవిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నీట్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 532వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని వైష్ణవిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందిచారు. ఆదివారం పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి నివాసంలో సోదరుడు గొల్లపల్లి సుబ్రమణ్యం కుమార్తె వైష్ణవికి పుష్పగుచ్చం అందించి ఎమ్మెల్యే సత్కరించారు. భవిష్యత్‌లో తలిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నాయకులు సుంకర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో బీజేపీ సమావేశం


మాట్లాడుతున్న కృష్ణవర్మ

కిర్లంపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశపు అమృతకాలం సేవ సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆది వారం కిర్లంపూడిలో బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బీజేపీ ఇన్‌చార్జి కృష్ణవర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా పెంటకోట సత్యనారాయణ, మారిశెట్టి త్రిమూర్తులు, అతికింశెట్టి సత్యనారాయణ బీజేపీలో చేరారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గండి కొండలరావు, డివిఎస్ రాజు, సింగిలిదేవి సత్తిరాజు, జయశ్రీ, అల్లు శివరామకృష్ణ, గోకేడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు


గండేపల్లిలో తుప్పలతో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం

గండేపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నాణ్యతగా ఉన్న భవనాలను ప్రభుత్వ కార్యకలాపాలకు దేనికోదానికి ఉపయోగించకుండా నిరుపయోగంగా వదిలేస్తున్నారని పలువురు అంటున్నారు. మండలంలో సింగరంపాలెం వెళ్లే దారిలో ఉన్న భవనం గతంలో మహిళా సమాఖ్య, వ్యవసాయ శాఖకు ఉపయోగించారు. అయితే ప్రస్తుతం కొత్త భవనాలు రావడంతో ఆ శాఖలు ఆభవనాల్లోకి మారిపోయాయి. ప్రస్తుతం పాత భవనం నాణ్యతగా ఉన్నప్పటికీ నిరుపయోగంగా వదిలేయడంతో అడవులను తలపించే విధంగా మారాయి. వీటిని ఏదొక ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించాలని పలువురు అంటున్నారు.

తుది మెరుగులు

» జడ్.రాగంపేటలో ప్రారంభానికి సిద్ధమవుతున్న హెల్త్ సెంటర్

» అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం


ప్రారంభానికి సిద్ధమవుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్

గండేపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో జడ్.రాగంపేట గ్రామ శివారున నిర్మాణం చేపట్టిన హెల్త్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. అయితే ఈ హెల్త్ సెంటర్ ప్రారంభమైతే చుట్టుపక్కల గ్రామస్థులకు మెరుగైన వైద్యం అందుతుందని పలువురు అంటున్నారు. సుమారు రూ.6.50కోట్లతో 30 పడకలకు పైగా నిర్మాణం చేసిన హెల్త్ సెంటర్ గత ప్రభుత్వంలో ప్రారంభమైనప్పటికీ పనులు నత్తనడకగా జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో సీహెచ్‌సీ పనులు వేగవంతంగా ముందుకెళ్లడంతో ఇప్పటికే దాదాపు హెల్త్ సెంటర్ పనులన్నీ పూర్తయ్యాయని పలువురు చెపుతున్నారు. హెల్త్ సెంటర్‌కు సిమెంట్ రోడ్డు, ఆసుపత్రిలో అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తొందరలోనే ప్రారంభమవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో గండేపల్లి మండలంలో మురారి నుంచి నీలాద్రిరావుపేట వరకు సుమారు 19కిలోమీటర్ల మేర జాతీయరహదారి ఉంది. అయితే ఈ జాతీయరహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉంటున్నాయి. ఈ సమయంలో మెరుగైన వైద్యం కోసం కాకినాడ, రాజమండ్రి దూర ప్రాంతాలకు చికిత్సకు వెళ్లాల్సి వచ్చేదని హెల్త్‌సెంటర్ ప్రారంభమైతే గండేపల్లి, జగ్గంపేట తదితర ప్రాంతాలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ హెల్త్ సెంటర్‌లో సామాన్యులకు జనరల్, చంటి పిల్లలు, సర్జరీ, మత్తు, గైనిక్, డెంటల్ ఇలా అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

ప్రమాదకరంగా డ్రైనేజీ


గండేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ

గండేపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గండేపల్లి బస్టాండ్ సెంటర్‌లో హైవే పక్కనున్న డ్రైనేజీ స్లాబు బీళ్లలు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. ఎవరైనా ఆదమరిచి అటు వెళితే డ్రైనేజీలో పడి ప్రమాదాలకు గురవుతారు. దీనిపై హైవే అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతం బస్టాండ్ సెంటర్, డివైడర్ ఉండడంతో నిత్యం ప్రజల రాకపోకలు ఎక్కువగా నిర్వహిస్తారు. అలాగే పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు అక్కడే బస్సు ఎక్కుతారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఇక్కడ జనం తిరుగుతారని ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగే వరకు హైవే అధికారులు పట్టించుకోరని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే!

మార్జిన్ లేని సీసీ రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం



జగ్గంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మనాభ నగర్ చెరువుగట్టుపై వేసిన సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీనికి పక్క నుంచే ప్రధాన డ్రెయిన్ ఉంది. రోడ్డు కింద ఉన్న మట్టి కొట్టుకుపోవడంతో కుంగిపోతోంది. బరువైన వాహనాలు వెళితే కచ్చితంగా ఈ సీసీ రోడ్డు పగిలిపోయే పరిస్థితి ఉంది. రాత్రి వేళ వాహనదారులు సిమెంట్ రోడ్డుపై ప్రయాణం చేస్తూ డ్రైనేజీలో పడి క్షతగాత్రులవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

జగ్గంపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కొత్తూరులో ఓ పెట్రోల్ బంకును జగ్గంపేట జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆదివారం ప్రారంభించారు. ప్రతీఒక్కరూ స్వయంకృషితో ఎదగాలన్నారు. కార్యక్రమంలో నరిసే నాగేశ్వరరావు, మాదారపు వీరబాబు, కురుమళ్ల నాగేశ్వరరావు, రమేష్, కుంచే రాజా, అరువిల్లి నాగు, చిన్న, పద్మరాజు పాల్గొన్నారు.

రామవరంలో ఒకరిపై బైండోవర్ కేసు

జగ్గంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం గ్రామానికి చెందిన వీఎస్ బాబుపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. కోడి కత్తులు కట్టే వారిపైన, కోడి పందేలకు స్థలాన్ని ఇచ్చే యజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారం

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి అత్యధిక మార్కులతో సత్తా చాటిన విద్యార్థులకు తునికి చెందిన దేవాంగ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారాలు అందజేసింది. కార్యక్రమంలో డాక్టర్ బూడిద వీరభద్రుడు, బూడిద కృష్ణ, బోరు సాయిచంద్రశేఖర్, సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.

'తెలుగు సాహిత్యాన్ని శాసించిన కవి శ్రీశ్రీ'

పెద్దాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యాన్ని శాసించిన గొప్ప కవి శ్రీశ్రీ అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం వరహాలయ్యపేటలోని యానలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించారు.

సీతారామశర్మకు సత్కారం



జగ్గంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మం కోసం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చిక్కుడుపాలెం గ్రామం నుంచి పాదయాత్ర చేస్తున్న సీతారామశర్మను జగ్గంపేటలో టీడీపీ యువనాయకుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఆదివారం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మంచి దృఢ సంకల్పంతో హిందూ ధర్మ పరిరక్షణ కోసం తిరుమలకు పాదయాత్రను చేస్తున్న ఆయన సంకల్పం నెరవేరాలన్నారు.